## సణుగుట

**దేవుని సాటిలేని నామమునకు మహిమ కలుగును గాక !**

**ప్రభువైన యేసుక్రీస్తు నందు ప్రియమైన సహోదరి, సహోదరులారా మీకు వందనములు** . ప్రతిమనిషి ఏదో బలహీనలతో(శారీరక,ఆత్మీయ,మానసిక) భాదపడుతూ ఉంటాడు. ఆ బలహీనతల వల్ల రోజురోజుకి ఆత్మీయముగా దిగజారిపోతువుంటాడు. మానవుని దృష్టికి కొన్ని బలహీనతలు చాలా చిన్నవిగా కనిపిస్తుంటాయి. కాని వాటి తీవ్రత చాలా హెచ్చుగా వుంటుంది. వాటిలో ఒకటి **సణుగుట**. సణుగుట అనేది చాలా మందిలో కనిపించే బలహీనత, కాని ఈ బలహీనత వల్ల మనిషి దేవునికి, దేవుని రాజ్యానికి దూరము అవుతాడని గ్రహించలేకపోతున్నాడు. ఐగుప్తు నుండి బయలు దేరిన ఇశ్రాయేలీయులలో చాలా మందిలో ఈ బలహీనత మనము గమనించవచ్చు. మరియొక ప్రాముఖ్యమైన విషయము ఏమిటంటే **సణుగుట అనే బలహీనత ఎవరికీ వుంటుందో వారిని మాత్రమే కాక తమ ప్రక్కవాళ్ళని కూడా దేవునికి దూరము చేస్తుంది** . దేవుడు మనిషికి రెండు కాళ్ళు ,రెండు చేతులు, రెండు కళ్ళు ఇచ్చినట్టు రెండు నోరులు ఇచ్చివుంటే. ఒక నోటితో తింటూ మరియొక నోటితో సణుగుతూ వుండేవాడేమో.

**చావు కొరకు సణుగుట:** నిర్గమ:16:2-3 - ఆ అరణ్యములో ఇశ్రాయేలీయుల సమాజమంతయు మోషే అహరోనుల మీద సణిగెను. ఇశ్రాయేలీయులు మేము **మాంసము వండుకొను కుండలయొద్ద కూర్చుండి తృప్తిగా ఆహారము తినునప్పుడు యెహోవా చేతివలన ఏల చావక పోతిమి?** ఈ సర్వసమాజమును ఆకలిచేత చంపుటకు ఈ అరణ్యములోనికి మమ్మును అక్కడ నుండి తోడుకొని వచ్చితిరని వారితోననగా.

ఇశ్రాయేలీయులు ఏ విధముగా మాట్లాడుతున్నారో గమనించండి. ఐగుప్తులో బానిసబ్రతుకు బ్రతుకుతూ వుంటే యెహోవాదేవుడు కరుణించి బానిసబ్రతుకునుండి విడిపిస్తే **తృప్తిగా ఆహారము తినునప్పుడు యెహోవా చేతివలన ఏల చావక పోతిమి? అని సణుగుతున్నారు.**

**సమాధుల కొరకు సణుగుట:** **నిర్గమ :14:11-** అంతట **వారు మోషేతో ఐగుప్తులో సమాధులు లేవని ఈ అరణ్యములో చచ్చుటకు మమ్మును రప్పించితివా?** మమ్మును ఐగుప్తులోనుండి బయటికి రప్పించి మమ్మును ఇట్లు చేయనేల?

**దేవుని యాజకులపై (సేవకులు) సణుగుట :** **సంఖ్యా 14:2** మరియు ఇశ్రాయేలీయులందరు మోషే అహరోనుల పైని సణుగుకొనిరి.

**దేవుని ఏర్పాటుకు వ్యతిరేకముగా సణుగుట :** **సంఖ్యా 16: 10-11** ఆయన నిన్నును నీతో లేవీయులైన నీ గోత్రపువారి నందరిని చేర్చుకొనెను గదా. అయితే మీరు యాజకత్వముకూడ కోరుచున్నారు. ఇందు నిమిత్తము నీవును నీ సమస్త సమాజమును యెహోవాకు విరోధముగా పోగైయున్నారు. **అహరోను ఎవడు? అతనికి విరోధముగా మీరు సణుగనేల అనెను.**

**ఆహారము (పండ్లు) కొరకు:** **సంఖ్యా 20:5 –** ఈ కానిచోటికి మమ్ము తెచ్చుటకు ఐగుప్తులోనుండి మమ్మును ఏల రప్పించితిరి ? ఈ స్థలములో గింజలు లేవు అంజూరలు లేవు ద్రాక్షలు లేవు దానిమ్మలు లేవు.....

**త్రాగునీటి కొరకు సణుగుట:** **నిర్గమ 15: 24** ప్రజలు మేమేమి **త్రాగుదుమని మోషేమీద సణుగుకొనగా.** ఐగుప్తు చెరలో నుండి తప్పించిన దేవుడు త్రాగుటకు నీరు ఇవ్వడా ? నీటి కొరకు వీరు సణుగుతూ ఉండడము వల్ల మిక్కిలి సాత్వికుడు అయిన మోషే సహితము కోపము తెచ్చుకొని , దేవుడు బండతో మాట్లాడమంటే మాట్లాడకుండా బండను కొట్టాడు(సంఖ్యా 20:8,11). ఆ ఒక్క తప్పిదము మోషేను కానాను చేరకుండా చేసింది. జాగ్రత్త ప్రియ దేవుని బిడ్డల్లారా మన సణుగుడు మన చుట్టూ వుండే వాళ్ళ ఆత్మీయ జీవితాన్ని దెబ్బతీస్తుంది అని గమనించండి.

**సేవకొరకు సణుగుట:** **సంఖ్యా 16: 1-3-**లేవికి మునిమనవడును కహాతుకు మనుమడును ఇస్హారు కుమారుడునగు కోరహు,రూబేనీయులలో ఏలియాబు కుమారులైన దాతాను,

అబీరాములును,పెలేతు కుమారుడైన ఓనును యోచించుకొనిఇస్రయేలీయులలో పేరుపొందిన సభికులును సమాజ ప్రధానులైన **రెండువందల ఏబది మందితో మోషెకు ఎదురుగా లేచి మోషే ఆహారోనులకు విరోధముగా పోగుపడి మీతో మాకిక పని లేదు .....**

**విధవరాండ్రను చిన్నచూపు చూసినందుకు సణిగిరి : అపో'' కా : 6:1:** ఆ దినములలో శిష్యుల సంఖ్య విస్తరించుచున్నప్పుడు అనుదిన పరిచర్యలో తమలోని విధవరాండ్రను చిన్నచూపు చూచిరని

**హెబ్రీయులమీద గ్రీకుభాష మాట్లాడు యూదులు సణుగసాగిరి.**

**ఎవరు సణుగుతారు :**

**1) దేవుని మాట ఆలకింపని వారు సణుగుతారు**

**కీర్తన 106 : 25 యెహోవా మాట** ఆలకింపక వారు తమ **గుడారములో సణుగుకొనిరి.**

**2) భక్తిహీనులు సణుగుతారు:**

**యూదా 15,16: భక్తిహీనులైన పాపులు** తనకు విరోధముగా చెప్పిన కఠినమైన మాటలన్నిటిని గూర్చియు వారిని ఒప్పించుటకును, ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చెను.
వారు తమ దురాశలచొప్పున నడుచుచు,లాభమునిమిత్తము మనుష్యులను కొనియాడుచు,**సణుగువారును** తమ గతినిగూర్చి నిందించువారునై యున్నారు; వారి నోరు డంబమైన మాటలు పలుకును.

**సణుగు వారిని దేవుడు శత్రువుల చేతికి అప్పగిస్తాడు :ద్వితి 1:27** మీ గుడారము లలో సణుగుచు యెహోవా మనయందు పగపట్టినందున మనలను సంహరించునట్లు అమోరీయుల చేతికి మనలను అప్పగించుటకు ఐగుప్తుదేశములో నుండి మనలను రప్పించి యున్నాడు.

**శాస్త్రులు, పరిసయ్యులు క్రీస్తు శిష్యుల మీద సణుగుట :లూకా 5 : 30** పరిసయ్యులును వారి శాస్త్రులును ఇది చూచి సుంకరులతోను పాపులతోను మీరేల తిని త్రాగుచున్నారని ఆయన శిష్యులమీద సణిగిరి.

**యేసుక్రీస్తుని గూర్చి సణుగుట : ఎంతటి దౌర్భాగ్యము చివరకు యేసుక్రీస్తుమీద కూడా సణిగిన జనములను ఇక్కడ చూడవచ్చు.**

**ప్రభువు పట్ల ప్రేమ చూపించిన వారిమీద సణుగుట:మార్కు 14:5** ఈ అత్తరు మున్నూరు దేనార ముల కంటె ఎక్కువ వెలకమ్మి, బీదలకియ్యవచ్చునని చెప్పి ఆమెనుగూర్చి సణుగుకొనిరి.

**ఆయన భోజనము గురించి సణుగుకొనుట: లూకా 15:2** పరిసయ్యులును శాస్త్రులును అది చూచి ఇతడు పాపులను చేర్చుకొని వారితో కూడ భోజనము చేయుచున్నాడని చాల సణుగుకొనిరి.

**ఆయన బసచేయుటను గూర్చి సణుగుకొనుట :లూకా19:7** అందరు అది చూచి ఈయన పాపియైన మనుష్యునియొద్ద బసచేయ వెళ్లెనని చాల సణుగుకొనిరి. ఈ పాపపు లోకము ఆయన జన్మించినపుడు

పరుండబెట్టుటకు స్థలమియ్యలేదుగాని.ఒక పాపి జీవితాన్ని మార్చుటకు ,ఆ పాపి ఇంటికి వెళ్తుంటే దానిని గూర్చి సణిగినారు.

**మేలు చేసే క్రీస్తుని మోసపుచ్చే వాడు అని సణుగుట :**యోహాను 7:12 మరియు జనసమూహములలో ఆయనను గూర్చి **గొప్ప సణుగు** పుట్టెను; కొందరాయన మంచివాడనిరి; మరికొందరుకాడు, **ఆయన జనులను మోసపుచ్చువాడనిరి;**

**తీర్పు పొందకుండా ఉండాలంటే ఎవరిమీద సణగకుడి:**యాకోబు 5:9 సహోదరులారా, మీరు తీర్పు పొందకుండు నిమిత్తము ఒకనిమీదనొకడు సణగకుడి. ఒకని యెడల ఒకడు ప్రేమ చూపించమని వాక్యము చెబుతూ వుంటే, మనిషి మాత్రము ఒకని మీద ఒకడు సణుగుకొనుచున్నారు.

**ఎవరు సణగరు: దేవుని కుమారులు సణుగరు:** ఫిలిప్పు 2:14-15 మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములును మాని, సమస్త కార్యములను చేయుడి.

**హెచ్చరిక : గమనిస్తున్నారా ! చివరకు సణుగుడు మరణానికి దారి తీస్తుంది అని లేఖనాలు హెచ్చరిస్తున్నాయి.బుద్ధి కలుగటకు దేవుడు మనకోసం వాటిని లేఖనాలలో వుంచినారు.**

1 కొరింథీయులకు 10: 10-11 - మీరు సణుగకుడి; వారిలో కొందరు సణిగి సంహారకుని చేత నశించిరి. ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను.

**సణుగుట మానాలంటే దేవుని స్తుతించటం నేర్చుకోవాలి 24గంటలు దేవున్ని స్తుతిస్తూ,ఆరాధిస్తూ,సణుగుట, గొణుగుట మానివేసే ప్రక్రియే లెంట్.**

**అలాంటి కృప పరిశుద్ధాత్మదేవుడు మనకందరికీ దయచేయును గాక!**